## విద్యార్థులకు కళ్ల అద్దాల పంపిణీ

అంబర్‌పేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల, పోలీసు బాలుర పాఠశాలలో మంగళవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కళ్లు ఉంటేనే ఏ పనినైనా చేయగలగుతామన్నారు. ముందుగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల పోలీసు బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలమ్మ, వైద్యులు డాక్టర్ పూర్ణిమ కావ్య, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి.. వ్యక్తికి జీవిత ఖైదు

కవాడిగూడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాలికను చాకుతో బెదిరించి లైంగికదాడికి పాల్పడిన ఓ వ్యక్తికి నాంపల్లి కోర్టు అదనపు సెషన్స్ జడ్జి జీవితఖైదు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం.. 2023 ఆగస్టు 29న దోమలగూడలో అమర్ నేపాలి (37) ఓ బాలికను చాకుతో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సరైన ఆధారాలను కోర్టుకు సమర్పించడంతో నాంపల్లి కోర్టు 12వ సెషన్స్ జడ్జి నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

## రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**● టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి విక్రమ్‌యాదవ్**

నల్లకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసంను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్‌యాదవ్ పేర్కొన్నారు. ఉపాధికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ వికాసం పథకం కోసం ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 6 నుంచి 30వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల కేటాయింపు ప్రక్రియ చేపడుతారన్నారు. రూ.50 వేల నుంచి 4 లక్షల వరకు రాజీవ్ యువ వికాసం రుణాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్, నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

## నేడు, రేపు రాంచీలో లీగల్ మెట్రాలజీ శిక్షణ

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 సవరణలపై రాంచీలో జరిగే శిక్షణకు వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ప్రధానకార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్‌లు హాజరుకానున్నారు. సిమ్లాలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే జాతీయ వినియోగదారుల సదస్సుకు గౌరవ అతిథులుగా, ఈనెల 24న న్యూఢిల్లీలో జరిగే వినియోగదారుల అవగాహన సదస్సులో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ అధికారులతో పాటు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్‌లు హాజరుకానున్నారు. అయితే చక్రపాణి, సుదర్శన్‌లు మాట్లాడుతూ, వేసవిలో ప్లాస్టిక్ బాటిల్స్‌లోని దగ్గు మందు విషపూరితంగా మారుతున్న పరిస్థితులపై చండీగఢ్, బుద్దిలోని దగ్గుమందు తయారీ ప్లాంట్లపై ఈ ప్రాంత ఔషధ నియంత్రణ అధికారులకు వినియోగదారుల మండలి పక్షాన ప్రతినిధులుగా తాము ఫిర్యాదు చేస్తామన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే గోపాల్

## సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

**● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు కార్పొరేట్ వైద్యం సీఎంఆర్‌ఎఫ్‌తోనే సాధ్యమవుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఐదుగురు లబ్ధిదారులకు రూ. 2.70 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్‌లను పంపిణీ చేశారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం ఒక వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై శ్రీనివాస్‌రావు, మహహ్మద్ అలీ, చాంద్‌పాషా, శంకర్ గౌడ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ప్రవీణ్, కల్యాణ్, బాక్సర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ధరల స్థిరీకరణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

**● టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శిదశరథ్**

నల్లకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణ కోసం ఒక ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ కోరారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర వస్తువులపై వాణిజ్య పన్నుల శాఖ ఆన్‌లైన్‌తో కూడిన ఒక యాప్ ద్వారా వీటిని ప్రభుత్వ పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణతో దోపిడీని అడ్డుకట్ట పడితే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యం ఉచితంగా ఇస్తున్నాయన్నారు. కొంతమంది ఆ షాపు యజమానులు ఆ బియ్యాన్ని రూ. 10 నుంచి రూ. 20 వరకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కొంతమంది షాపు యజమానులు నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు.

## కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలి

గోల్నాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్ల కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని, ప్రమోషన్, పీ.ఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు జి.రాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అంబర్‌పేట మండల తహసీల్దార్ వీరాబాయికి ఆశావర్కర్లు, సీఐటీయూ నేతలతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. గతంలో ఆశలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో వారికి వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన పలు హామీలను కూడా నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ యూనియన్ అంబర్‌పేట జోన్ నాయకులు ఎ.సరస్వతి, దేవయాని, శోభ, విజయలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం

**● టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా**

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశంతో పొత్తు వల్ల బీజేపీ నష్టపోతుందని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. మంగళవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయకపోవడం వల్ల ప్రజలు బీజేపీకి ఓట్లు వేశారని, ఈ సత్యాన్ని మరిచిపోకూడదన్నారు. గతంలో రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఏమిటో ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. దేశం, రాష్ట్రం నుంచి కాంగ్రెస్‌ను పారదోలాలనే లక్ష్యంతో పనిచేస్తున్న టీడీపీకి పూర్తిగా క్షేత్రస్థాయిలో పార్టీశ్రేణులు ఉన్న సంగతి మరచిపోవద్దని అన్నారు. కేంద్రంలో టీడీపీ మద్దతు ఇస్తున్న సంగతి ఆపార్టీ నేతలు మరువరాద్దన్నారు. తెలంగాణలో 8 ఎంపీ సీట్లు గెలవడానికి టీడీపీ కూడా ఒక కారణమన్నారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కై కొంత మంది ఎమ్మెల్యేలు అధికారం కోసం పాకులాడుతున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

### ● సీఎంకు సత్కారం

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ గౌడ కల్లు గీతాల సంఘం సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ యెలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్‌లు సన్మానించారు. మంగళవారం సీఎంను కలిసి సత్కరించారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడం విదితమే. బిల్లు రావడానికి కృషి చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విప్ ఆదిశ్రీనివాస్‌లకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న బాల్‌రాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు

### ● ప్రైవేట్‌పరం చేసే కుట్ర..

కవాడిగూడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఏవీ కళాశాలను రాజకీయ పలుకుబడితో యాజమాన్యం ప్రైవేట్‌పరం చేసే కుట్రలు చేస్తోందని ఏవీ కళాశాల విద్యార్థులు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మంగళవారం హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు రేవంత్, విష్ణు, ఆకాంక్ష, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.



హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు





కమ్యూనిటీ హాలు, నిరుపయోగంగా మారిన ఫ్యాన్లు, లైట్లు

# కమ్యూనిటీ హాలులో సౌకర్యాలేవి?

- తిరగని ఫ్యాన్లు.. వెలగని లైట్లు
- ఎటు చూసినా అపరిశుభ్రత
- శుభాకార్యాల నిర్వాహకులకు తప్పని అగచాట్లు
- బండమైసమ్మ బస్తీవాసులు, ప్రజలకు సైతం..
- ఆదాయం బాగున్నా.. పట్టించుకోని వెల్ఫేర్ అసోసియేషన్
- బండమైసమ్మనగర్‌లో దుస్థితి ఇదీ..

**బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలులో కనీస సదుపాయాలు కొరత వేధిస్తోంది. ఫ్యాన్‌లు తిరగడం లేదు. లైట్లు వెలగని పరిస్థితి. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో ఎక్కడ చూసినా అపరిశుభ్రత వాతావారణం కనిపిస్తుంది. దీంతో శుభకార్యాల నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదాయం బాగున్నా... వెల్ఫేర్ అసోసియేషన్ మాత్రం సౌకర్యాలు కల్పించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆపై నిధులు దుర్వినియోగం అవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.**

కవాడిగూడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):

నాటి ఉమ్మడి ఆంధ్ర సీఎం చంద్రబాబు నేతృత్వంలో బండమైసమ్మనగర్‌లో బస్తీవాసుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణమైంది. ఈ ప్రాంతంలో 2500 జనాభా నివసిస్తున్నారు. ప్రతీ ఇంటి యజమాని భాగస్వామ్యం ఉండాలని ఉద్దేశంతో ప్రతీ ఇంటి నుంచి రూ.500తో పాటు ప్రభుత్వ నిధులతో దాన్ని నిర్మించారు. బస్తీవాసుల శుభకార్యాలు నిర్వహించుకుంటే రూ.1,500, స్థానికేతరులు అయితే రూ.3,000 చెల్లించాలని నిబంధనలు పెట్టారు.

ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేక శుభకార్యాలు, చిన్న చిన్న సమావేశాలు ఏర్పాటు చేసుకునే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో ఉన్న ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదు. అయితే ఆదాయం ఫుల్లుగా ఉన్నా బండమైసమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డబ్బులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే మరమ్మతులు చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అంతేగాక వేడుకకు అవసరమైన వంట సామగ్రి, డెకరేషన్ చేసి వాటి నిర్వాహకులు ఇష్టారీతిన బిల్లు వేసి దోపిడీ పాల్పడుతున్నట్లు విమర్శలూ ఉన్నాయి.

### మూలనపడిన జిమ్ సామగ్రి

కొన్నేళ్ల క్రితం బస్తీ యువత కోసం ఇందులోనే జిమ్ ఏర్పాటు చేయగా సామగ్రి అంతా ఓ గదిలో మూలన పడేయడంతో తుప్పుపట్టింది. ఇప్పటికైనా జిమ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరినా ఎవరూ వినిపించుకోవడం లేదు. అలాగే హాలు నిర్వహణ లెక్కలు బహిర్గతం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి తమ ఆధీనంలో తీసుకుని కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని ప్రజా ప్రతినిధులను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను బండమైసమ్మనగర్ బస్తీ వాసులు కోరుతున్నారు.

### డబ్బులు దుర్వినియోగం కాలేదు

బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలు వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌లో లక్షా యాభై వేల రూపాయలు ఉన్నాయి. కమ్యూనిటీ హాలులో కనీస సౌకర్యాలు కల్పించేందుకు వెంటనే వెలగని లైట్లు, ఫ్యాన్‌లకు మరమ్మతులు చేయిస్తాం. బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలు డబ్బులు ఎక్కడ కూడా దుర్వినియోగం కాలేదు.



ఎన్. వెంకన్న
బండమైసమ్మనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

## ఆలిండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ అధ్యక్షుడిగా శ్యామ్

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సిరిగిరి శ్యామ్ నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన నియామకాన్ని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.యు.దువ ధ్రువీకరించారు. మంగళవారం శ్యామ్ విలేకరులతో మాట్లాడుతూ తాను చేస్తున్న సామాజిక పోరాటాలను గుర్తించి తనకు ఈ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో దశలవారీగా పర్యటిస్తానని, పౌరుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. ప్రతీ పౌరుడు తన హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



సిరిగిరి శ్యామ్

## ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లు

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిందని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందినందుకు హర్షం వ్యక్తం చేశారు. దండోరా ఉద్యమాన్ని 30 ఏళ్లు సజీవంగా కొనసాగించింది ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులేనన్నారు. అందుకే ఇది ఎమ్మార్పీఎస్ ఉద్యమ విజయంగా భావిస్తున్నామన్నారు. సంఘం ఉద్యమకారులు, అమరుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, వెంకట్, చందు, రాధ, నాగరాజు, సురేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని వెల్ఫేర్ సెంటర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాసాని సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడిగా వైఆర్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా అంజిబాబు, సంయుక్త కార్యదర్శిగా గోళ్ళమూడి పద్మావతి, కోశాధికారిగా బి. శివనాయుడు, కార్యవర్గసభ్యులుగా ఎంవీడబ్ల్యు సూర్యనారాయణ, కె. హనుమంతరావు, బి. సూర్యనారాయణ, అభయ్ డోంగ్రే, సి.వి. వైశ్యం సాయన్న, బి. రామ్మూర్తి, ఎ. నాగలక్ష్మి, ఎం. రామలక్ష్మి, బి. రూప, ఉమా, రాంకోటేష్, నీరులు ఎన్నికయ్యారు. కాగా ఎన్నికల అధికారులుగా ఐఎస్ఎన్ మూర్తి, రామ్‌కోటేశ్వర రావు, లలిత వ్యవహరించారని అధ్యక్షుడు బాసాని సూర్యప్రకాష్ వివరించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈ ఘటన జరిగింది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... బోలక్‌పూర్ కృష్ణానగర్ కాలనీలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. మృతుడు 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉంటుంది. ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో, సెల్ నంబర్ 87126 60140లో సమాచారం అందించాలని సీఐ కోరారు.

## నరేంద్రనగర్‌లో పూడికతీత పనులు

అంబర్‌పేట డివిజన్ నరేంద్రనగర్‌లో డ్రైనేజీ పూడికతీత పనులను మంగళవారం జలమండలి సిబ్బంది చేపట్టారు. ఇది కాస్తా నిండి దుర్గంధం వ్యాపిస్తుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆశాఖకు సమాచారం అందించగా ఈ ప్రాంతానికి చేరుకొని పనులు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు మల్లయ్య, కృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి



## 'స్థానికం'లో బ్రాహ్మణులకు రిజర్వేషన్లు కల్పించాలి

నల్లకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీజీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఏఐసీసీ అగ్రనేతలు, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమను బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్‌తో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆపై సత్కరించారు. స్థానిక ఎన్నికల్లో బ్రాహ్మణులకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి సునీల్, వి.ఉగ్రగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

**● మ్యాన్ సప్లయ్ యజమాని మల్లయ్య**

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న రూ. 1 కోటి 90 లక్షలకు పైగా చెల్లించాలని లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మనమాల మ్యాన్ సప్లయ్ యజమాని దోమల మల్లయ్య తెలిపారు. హైదరాబాద్ జిల్లా ఎస్సీ డీడీ కార్యాలయం ఎదుట ఆయన చేపట్టిన దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు దీక్ష కొనసాగుతుందని, భార్యాపిల్లలతో కలిసి దీక్ష చేస్తానని హెచ్చరించారు. సీఎం, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నతాధికారులు స్పందించి బకాయిలను కల్పించాలని అన్నారు. బిల్లులను ఇవ్వకుండా అడ్డుపడుతున్న అధికారులను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం హర్షణీయం



రాంనగర్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న టీపీసీసీ కార్యదర్శి శ్యామ్‌యాదవ్, వంజరి శ్రీనివాస్ తదితరులు

రాంనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న బిల్లును మంత్రివర్గం ఆమోదించడంపై తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, బీసీ జన సమితి అధ్యక్షుడు ఎస్.జశ్వంత్‌కుమార్, ముషీరాబాద్ జన సమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్‌లు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అడిక్‌మెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థలతో పాటు ఉద్యోగ నియామకాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలుకు క్యాబినెట్ ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. ఈ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించి రాష్ట్రపతి వద్దకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి నాయకులు గుండెబోయిన రవీందర్ యాదవ్, అజయ్‌గౌడ్, హనుమంత్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం వాటా లభిస్తుందని టీపీసీసీ కార్యదర్శి ఏ. శ్యామ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం పొందడాన్ని స్వాగతిస్తూ బీసీ నాయకులు రాములు ముదిరాజ్, పర్వతాలు ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం, బీసీ కులగణన నిర్వహించి ప్రస్తుతం ఉన్న 29 శాతం నుంచి 42 శాతం పెంచడం గర్వకారణమన్నారు. టీపీసీసీ కార్యదర్శి వంజరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ వర్మ, రాజు, సంపత్, ఉదయ్, గోపాల్, జగన్ యాదవ్, వాసుయాదవ్, జానీ పాల్గొన్నారు.

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం

బర్కత్ పుర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడం చరిత్రాత్మకమైన నిర్ణయమని తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. రాజేందర్ అన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘాల నేతలు వెంకటేష్, జి.అనంతయ్య, భూపేష్ సాగర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడానికి ఎంపీ ఆర్.కృష్ణయ్య సారథ్యంలో అన్ని పార్టీల ఎంపీలను కలిసి మద్దతు ఇవ్వాలని కోరుతామని చెప్పారు. కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించడానికి కృషి చేయాలన్నారు.

## యాచకుడి మృతి

కవాడిగూడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..... ఓ వ్యక్తి(50) సోమవారం మధ్యాహ్నం నుంచి ఎల్ఐసీకాలనీలో సమీపంలోనే తిరుగుతున్నాడు. ఏమైందో ఏమో తెలియదు గానీ మంగళవారం ఉదయం చూసే సరికి కాలనీ ఫుట్‌పాత్‌పై విగతజీవిగా కనిపించాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్ సిబ్బందిని పిలిపించి పరిశీలించగా అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని వారు తెలిపారు. వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీమార్చురీకి తరలించారు. ఈ కేసును దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 87126-61521లో సమాచారం అందించాలని సీఐ కోరారు.

## గాంధీనగర్ డివిజన్‌ను తీర్చిదిద్దుతాం : కార్పొరేటర్



అశోక్‌నగర్ సర్కిల్‌లో సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పలు ప్రాంతాలలో సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ సర్కిల్‌లో కొనసాగుతున్న పనులను జీహెచ్‌ఎంసీ ఏఇ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, వారి సిబ్బందితో కలిసి ఆమె పర్యవేక్షించారు. డివిజన్‌లోని మరికొన్ని చోట్లకూడా ఈ పనులు త్వరలో చేపడుతామని వివరించారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న పార్క్‌లు, చౌరస్తాలు, కూడళ్లను సుందరీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోనే డివిజన్‌ను ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్‌నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాష్ యాదవ్, జ్ఞానేశ్వర్, సాయికుమార్, ఆనంద్‌రావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.